క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: కారేపల్లి సహకార పరపతి సంఘం (సొసైటీ) డైరెక్టర్ డేగల ఉపేందర్ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఖమ్మంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉపేందర్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వీరితో పాటు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ధరావత్ భద్రూలాల్ కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బానోత్ రామ్మూర్తినాయక్, అరుణ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు..



కౌన్సిలర్ చాంద్‌పాషాను పరామర్శిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: పదేళ్లు ఎమ్మెల్యేగా ఎలా పనిచేశానో అందరికీ తెలుసు.. ఇప్పుడు ఎంత అరాచకం జరుగుతుందో ప్రజలు అన్ని గమనిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం 8వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే చాంద్‌పాషాను పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న నడ్డి జమలమ్మను, తడికమళ్ల ప్రకాశరావును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, ఎస్‌కే రఫీ, ఎండీ గఫార్‌ఖాన్, మాధురి మధు, ఎస్‌కే అయాబ్‌పాషా, అద్దంకి అనిల్, అమరవరపు కృష్ణారావు, వల్లభనేని పవన్, బెల్లకొండ రాము, మదీనాపాషా, కొప్పుల అప్పారావు, మరికంటి శ్రీను పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

వైరా: వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఏకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శివలింగం, తిమ్మిడి హనుమంతరావు తెలిపారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ జనరల్ బాడీ సమావేశం గురువారం వైరాలో ఎస్‌కే జానీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనిదినాల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. కనీస వేతనం రూ.600 చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో నాయకుల కంకణాల అర్జునరావు, కొల్లి నాగేశ్వరరావు, కంకణాల పెద వెంకటి, సాగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



రెబ్బవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఓటు హక్కుపై రెవెన్యూ మండల పరిషత్, ఈజీఎస్ శాఖల ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే.వీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ సరస్వతి, ఎంపీఓ జ్యోత్స్నదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను కట్టడి చేయాలి

కారేపల్లి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులను కట్టడి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. గురువారం కారేపల్లిలో జరిగిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, మండల కార్యదర్శి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ



కబ్జాకు గురైన పాయపూర్ పెద్ద చెరువు

పాయపూర్ పెద్ద చెరువుకు పాస్‌పుస్తకాలు

- 51 ఎకరాలు కబ్జా, దర్జాగా ధరణిలోకి
- ఆరేళ్లుగా రైతుబంధు దిగమింగిన అక్రమార్కులు



పాయపూర్ పెద్ద చెరువులోనే చిన్న చెరువు ఏర్పాటు చేసిన అక్రమార్కులు

కల్లూరురూరల్: మండలంలోని పాయపూర్ పెద్ద చెరువుకు రెవెన్యూశాఖ అధికారులు పాస్ పుస్తకాలు జారీ చేశారు. పాయపూర్ పెద్ద చెరువు 239, 240, 241, 204, 203, 242 సర్వే నంబర్లలో 107 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. దీనిలో 242 సర్వే నంబర్‌లో 50 ఎకరాల ముంపు శిఖం భూమి ఉన్నది. దీనిపైనే అక్రమార్కులు కన్నేసి.. 10 మంది వ్యక్తులు వ్యక్తులు 2016–17 సంవత్సరంలో రెవెన్యూ అధికారుల సహాయంతో సుమారు 51.7 ఎకరాల వరకు పాస్ పుస్తకాలు పొంది ధరణిలో సైతం నమోదు అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.40 లక్షలు మేరకు అక్రమ పాస్ పుస్తకాల ద్వారా రైతుబంధు పొందారు.

క్షేత్రస్థాయిలో చూడకుండానే పాస్ పుస్తకాలు మంజూరు..

ఒక రైతుకు సంబంధించిన భూమికి పాస్ పుస్తకం మంజూరు చేయాలంటే క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆ భూమిని సందర్శించాల్సి ఉంటుంది. కాని ఇవేమి లేకుండానే రెవెన్యూశాఖ 51.7 ఎకరాల చెరువు ముంపు భూమికి పట్టాలు ఇచ్చి పాస్‌పుస్తకాలు మంజూరు చేసి ధరణిలో ఎట్లా నమోదు చేశారో తేలాల్సి ఉంది.

ధరణి పాస్ పుస్తకాలతో వ్యవసాయ రుణాలు..

అక్రమంగా పొందిన ధరణి పాస్ పుస్తకాలతో కొంత మంది బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లక్షల్లో బ్యాంక్ రుణాలు తీసుకున్న అక్రమార్కులు ప్రభుత్వం ఎలాగో వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తుంది.. కాబట్టి ఇప్పటికే చాలా వరకు రుణాలు మాఫీ అయినట్లు తెలుస్తుంది. సొంత భూమి ఉండి సాగు చేసుకుంటున్నప్పటికీ ధరణిలో నమోదు కావాలంటే నానా కొర్రీలు పెట్టి ఆఫీసు చుట్టూ రైతులను తిప్పించుకునే రెవెన్యూశాఖ అధికారులు చెరువు ముంపు భూమికి ఏ విధంగా పట్టాలు ఇచ్చారో విచారణలో తెలియాల్సి ఉంది.

చెరువు భూమి దర్జాగా ఆక్రమణ..

పాయపూర్ పెద్ద చెరువు భూమిని అక్రమార్కులు కొందరు ఆక్రమించుకుని చెరువు ముంపుకు గురికాకుండా మట్టిపోసి ఎత్తు పెంచుతున్నారు. అదే విధంగా చెరువు వరద రాకుండా ఏకంగా అడ్డుకట్ట వేశారు. చెరువు భూమిలో మట్టి తోలుతుండగా కొందరు గిరిజనులు గుగులోత్ నరసింహా, సున్నావత్ నాగేంద్ర, ధరావత్ రాంబాబు, జర్పుల భోడియా, జర్పులా రాములుతో పాటు మత్స్య సహకార సంఘానికి చెందిన కోలేటి శ్రీను, గజ్జల కృష్ణయ్యలు అడ్డగించి మట్టి తోలకుండా నిలిపి వేయించారు.

ఇరుశాఖల మధ్య సమన్వయ లోపం..

చెరువులను జలవనరులశాఖ అధికారులు సంరక్షించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఆ శాఖ అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పాయపూర్ చెరువు ముంపు భూముల్లో మట్టి తోలి దర్జాగా ఆక్రమించుకుంటున్నప్పటికీ ఇరిగేషన్‌శాఖ అధికారులు అటు వైపు చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేసినట్‌లైతే చెరువులను ఆక్రమణలకు గురికాకుండా చూడవచ్చు.

చెరువులో చిన్న చెరువు..

పాయపూర్ పెద్ద చెరువులోనే ఒక అక్రమార్కుడు చిన్న చెరువు ఏర్పాటు చేశాడు. ఇందులో చేపల పెంపకం కోసం ఈ చిన్న చెరువును ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. చిన్న చెరువు ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ అధికారులు ఎవరూ అటువైపు వెళ్లలేదు.

విచారణ చేపడతాం..



పాయపూర్ పెద్ద చెరువు ముంపు భూములకు సంబంధించి పాస్ పుస్తకాల మంజూరుపై విచారణ చేపడతాం. అక్రమంగా పాస్ పుస్తకాలు మంజూరు చేసినట్‌లైతే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. ఇరిగేషన్, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో చెరువులు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. చెరువు మొత్తం భూమిని సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– పులి సాంబశివుడు, తహసీల్దార్, కల్లూరు



చెరువును ఆక్రమించి ఫెన్సింగ్ చేసిన దృశ్యం

ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: జమాతే ఇస్లామిహింద్ సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో రంజాన్‌మాసం సందర్భంగా గురువారం 300 మంది పేద ముస్లింలకు నిత్యావసరాలను ఎమ్మెల్యే మట్టా రగమయి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జమాతే ఇస్లామిహిహింద్ ముస్లిం నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామిహింద్ బాధ్యులు మున్వర్‌ఖాన్, అమీర్‌జాని, జామెమసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి ముకరం హుస్సేన్, ఎండి షరీఫ్, ఎండి కమల్‌పాషా, అలవాల కరుణాకర్ పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు..

కల్లూరు: కల్లూరు పట్టణంలోని రామానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, సత్యంబాబు, యాకూబ్ అలీ, కృష్ణారెడ్డి, రంగా, సుబ్బారావు, ఉస్మాన్, శ్రీకాంత్, కాంతారావు, కిషోర్, మైబు తదితరులు పాల్గొన్నారు.

జలబిందెలు, బోనాలతో ఊరేగింపు



జలబిందెలతో ఆలయానికి వస్తున్న మాలధారులు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలోని శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవి కల్యాణ మహోత్సవం సందర్భంగా గురువారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జలబిందెలు, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువకులు, చిన్నారులు గ్రామంలోని వీధుల్లో జలబిందెలు, బోనాలు నెత్తిన పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో మామిడి తోరణం, మాలధారణలతో అలంకరించారు. అనంతరం పూజారులు గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామికి పంచామృత స్థాన జలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. కంఠమహేశ్వరస్వామి, సురమాంబ కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం సభ్యులు కుటుంభ సభ్యులు పీఠలపై కూర్చొని కల్యాణ క్రతువును తిలకించారు. అనంతరం 3వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లి, అంకమ్మ తల్లి విగ్రహాలతో పాటుగా.. ధ్వజస్తంభం, నాభిశిలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలకు వెంకటాపురం పరిసర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

సీసీ రోడ్లు ప్రారంభం

కారేపల్లి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు మండలంలో సాగుతున్నాయి. దీనిలో భాగంగానే.. గురువారం కారేపల్లిలో భారత్‌నగర్, బొడ్రాయి బజార్, క్యాబీన్ బజార్, స్టేషన్ రోడ్డు, గాంధీసెంటర్, మోడల్ స్కూల్ రోడ్డు, బీసీ కాలనీ, మందులవాడ బజార్‌లలో సీసీ రోడ్లు పనులుచేపట్టారు. కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, శ్రీను పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయిబాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి తదితరులున్నారు.

ఘనంగా శ్రీరామాయణ సప్తాహం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో శ్రీరామాయణ సప్తాహం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రవచన కర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యాన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా శ్రీరామ సహస్రనామార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణాలు, శ్రీరామాయణం ప్రవచనం నిర్వహించారు. లీలాకృష్ణ, విజయలక్ష్మి, కేశవరెడ్డి, సుబ్బారావు, శంకర్‌రావు, వెంకటేశ్వరరావు, రామ్మోహనాచార్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

వైరా: కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వైరాకు చెందిన వెంకటేష్ గురువారం తన ద్విచక్రవాహనంపై పాత బస్టాండ్ బంక్ సమీపాన రోడ్డు దాటుతున్నాడు. ఇదేసమయంలో వైరా నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

తల్లాడ: ఇటీవల దాసరి జానకి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. గురువారం ఫోన్ లభించడంతో తల్లాడ ఎస్‌ఐ కొండల్‌రావు ఆమెకు సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. బస్టాండ్, ఇతర రద్దీగా ఉన్న ప్రదేశాల్లో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుబల్లి: ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న ట్రక్..ఆటోను, కారు ఢీకొనగా రెండు వాహనాలు దెబ్బతినడంతో పాటు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం తుమ్మలపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఉల్లిపాయల లోడ్‌తో తిరువూరు వైపు నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న ఆటోను కొత్తగూడెం నుంచి ఏపీలోని గన్నవరం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ శ్రీను, కారులో ప్రయాణిస్తున్న గీతాఅన్వేష్‌కు గాయాలయ్యాయి. గన్నవరానికి చెందిన నలుగురు కొత్తగూడెంలో వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను తిరువూరులోని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు వీఎం బంజర్ పోలీసులు చేరుకుని వివరాలు ఆరా తీశారు.

అక్రమార్కులను శిక్షించాలి

వైరా: వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లను నిరశిస్తూ సీపీఐ వైరా మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. వైరా, మున్సిపాలిటీ, కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు పట్టాలు జారీ చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాలరావు, రామకృష్ణ, అశోక్, రాఘవరావు తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సత్తుపల్లిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని బీజేపీ పార్లమెంట్ విస్తారక్ రాజు అన్నారు. సత్తుపల్లిలో గురువారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాల న్నారు. అనంతరం రాజును సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రసాద్, జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, మధు, రాంబాబు, శ్రీనివాస్, నాగస్వామి, లక్ష్మీనారాయణ, వసంతరావు, రహ్మతుల్లా, సుభాని, విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి నో ఎంట్రీ..!



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్

- స్థానిక ఎమ్మెల్యేదే తుది నిర్ణయం
- వలసలను అంగీకరించం..
- కాంగ్రెస్ నేత డాక్టర్ మట్టా దయానంద్ వ్యాఖ్యలు

సత్తుపల్లి: 'రాజకీయాలలో శాశ్వత మిత్రులు.. శాశ్వత శత్రువులు ఉండరనేది నానుడి.. నిన్నటి వరకు ఒక పార్టీని విమర్శలతో దుమ్మెత్తిపోసి.. తిరిగి అదే పార్టీలో చేరటం నేటి రాజకీయాల్లో సర్వసాధారణం. తల్లాడ మండలంలో బుధవారం రాత్రి జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఆ పార్టీ ముఖ్యనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికలప్పుడు పార్టీలో పని చేసిన వారికే గుర్తింపునిచ్చి.. అండగా ఉంటామన్నారు. సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు ఏమీ లేవు.. అంతా ఒకటే.. అది కాంగ్రెస్ గ్రూపు.. కొత్తగా ఎవరిని పార్టీలో చేర్చుకోం.. ఏ మంత్రి సిఫార్స్‌తో వచ్చినా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిదే తుది నిర్ణయం ఉంటుంది. స్థానిక కాంగ్రెస్ నేతల సిఫార్స్ ఉంటేనే అది కూడా గ్రామస్థాయి కార్యకర్తలను తీసుకుంటామంటూ దయానంద్ చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంలో సంచలనంగా మారాయి.

కాంగ్రెస్‌లో చేరేందుకు..

అధికారం మార్పిడి జరిగినప్పుడల్లా పార్టీలు మారటం అనవాయితీగా వస్తోంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికల వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు కొంతమంది రాయబారాలు జరుపుతున్నారని.. దీనిని అడ్డుకునేందుకు ఇప్పటికే ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మరికొందరు మండలాల వారీగా వరుస భేటీలు నిర్వహిస్తుండటంతో సత్తుపల్లి రాజకీయ రసకందాయంలో పడింది. కల్లూరు మండలంలో ఏకంగా ఇతర పార్టీల నేతలను చేర్చుకోవద్దంటూ తీర్మానం చేయటం.. తల్లాడ మండలంలో సమావేశాలు జరపటం చర్చనీయాంశమైంది.

వలసలకు బ్రేక్ పడేనా..

కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కొత్తగా పార్టీలో చేరికలను అంగీకరించమని స్పష్టం చేయటంతో కాంగ్రెస్ పార్టీలో వలసలకు తాత్కాలికంగా బ్రేకులు పడతాయా అని చర్చించుకుంటున్నారు. ఎన్నికలు ముగిసి వంద రోజులు కాకముందే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నేతలు అధికార కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చటంపై ఆ పార్టీ నేతలు కూడా అంతర్గతంగా విశ్లేషించుకుంటున్నారు. వలసనేతల రాకతో పార్టీలో కష్టపడిన తమకు పదవులు ఎక్కడ దక్కకుండా పోతాయోనంటూ అధికార పార్టీ నేతల గెండెల్లో గుబులు అలుముకుంది.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈఓ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఎంఈఓ ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంలో నాలుగు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు, చార్జింగ్ పెట్టేందుకు సాకెట్లు తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేసి నీళ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించటం జరుగుతుందని తెలిపారు. అనంతరం మడుపల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ముదిగొండ: మండలంలోని వల్లభి వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను గురువారం రాత్రి ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్ ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న పాస్టర్స్ ఫెలోషిప్ సమితి సభ్యులు

బోనకల్: మధిర నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ మధిర నియోజకవర్గ అధ్యక్షుడు దావీదు తెలిపారు. బోనకల్‌లో గురువారం మధిర నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులకు సమాధుల తోట, చర్చిలకు ఉచిత విద్యుత్, సేవకులకు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మధిర నియోజవర్గ సంయుక్త కార్యదర్శిగా స్టీఫెన్ పాల్‌ను ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మధిర నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ సమితి కార్యదర్శి డేవిడ్‌రాజు, కోశాధికారి పాల్, బోనకల్ మండల అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి అబ్రహం, జిల్లా కమిటీ సభ్యులు రాజారత్నం, ఎర్నెస్ట్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆడమ్స్



అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్



ప్రధాన కార్యదర్శి రమేష్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తేళ్లూరి ఆదియ్య(ఆడమ్స్) ఎన్నికయ్యారు. గురువారం సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి సీహెచ్ శేషారావుపై 21 ఓట్ల మెజార్టీతో ఆడమ్స్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఎం.రమేష్, కె.శంకర్‌రావు పోటీ చేయగా 9 ఓట్ల మెజార్టీతో ఎం.రమేష్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వరరావు, సెక్రటరీగా పి.రత్నాకర్, కోశాధికారిగా వి.రామకృష్ణ, లైబ్రరీ సెక్రటరీగా ఎం.జనార్ధనాచారి, క్రీడల సెక్రటరీగా జెవి నరేంద్ర, మహిళా రిప్రజెంటీవ్‌గా ఎస్‌కె జిన్నతున్నీసా, ఎగ్జిక్యూటీ కమిటీ సభ్యులుగా కె.కేశవరెడ్డి, బి.మారేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎనియ్యారు. ఎన్నికల అధికారిగా బోగి నాగమల్లేశ్వరరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బంజరా తండా నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని బంజర గ్రామంలో సంతు సేవాలాల్ బంజారా తండా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నాయక్, కారభారి, తండా సభ్యులను ఎన్నిక చేశారు. తండా నాయక్‌గా ధరావత్ చంద్రు, కారభారిగా భూక్య కృష్ణ, మోతాదుగా మెగావత్ పండులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా భుక్య బాలాజీ నాయక్,బనావత్ కొండ నాయక్, ఈస్లావత్ జమ్లా నాయక్ హాజరయ్యారు. పలువురు బంజారా తండా పెద్దలు ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ద ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ గౌట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన మూడురోజుల శిక్షణా తరగతులు గురువారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ మూడురోజులు డైరెక్టర్ ఆఫ్ ఎఫ్‌టీసీసీఐ డాక్టర్ అంకిత్ పట్నాకర్, సీనియర్ ఫ్యాకల్టీ ఎయిర్‌ఫోర్స్ ధాస్యపు మురళీధర్ ఆధ్వర్యంలో బీటెక్ 4వ సంవత్సరం, బీఫార్మసి 4వ సంవత్సరం, ఎంబీఏ మిస్ట్ కళాశాల విద్యార్థులు, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఎక్స్‌పోర్ట్స్, ఇంఫోర్ట్స్ మేనేజిమెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, డిప్లమో డీన్ డాక్టర్ రామచంద్రరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.కుమార్‌రాజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.